# పశ్చాత్తప్తుడగు పాపి

శ్రీమతి జె. సీతాలక్ష్మికన్యగారు

ఒకానొకడీప్రపంచమున డెబ్బదేండ్లు జీవించెను. తనజీవితకాలమంతయు పాపభూయిష్టమగు దుష్కార్యములాచరించి మహాపాపిగాఁ జీవించెను. వృద్ధాప్యమున మహారోగముచే పీడింపఁబడజొచ్చెను. కాని అప్పుడైనను తన పాపకార్యములనుఁదలచి పశ్చాత్తప్తహృదయుఁడుగాలేదు. అవసానము సమీపించెను. ప్రాణవాయువులు కంఠగతమైనప్పు డీవిధముగా దుఃఖించెను. "ప్రభువా! నన్ను క్షమింపుము. శిలువమీద మహాపాపులను మీరెట్లు క్షమించితిరో ఆవిధముగా నన్ను క్షమింపవేడెదను!" ఈమాటలతో పశ్చాత్తప్తహృదయుఁడై ప్రాణములవిడెను. ఈతనిఆత్మ పరమేశ్వరునియందు ప్రేమపూరితమైనదియు ఆమహామహుని అపారకరుణయం దమితవిశ్వాసము గలదియునగుటచే స్వర్గద్వారములచెంతకేగి తనను స్వర్గరాజ్యములోనికిఁ జొరనిమ్మని ప్రార్థించుచు ద్వారములను తట్టజొచ్చెను. అంతటలోనుండి ఒకవ్యక్తి ఈక్రిందివిధముగ మాటాడజొచ్చెను.

స్వర్గవ్యక్తి:—ఎవ రీస్వర్గద్వారముల తట్టువారు? ఇందుప్రవేశించుట కీవ్యక్తి తనజీవితకాలమున నెట్టి సత్కార్యములనొనర్చెను?

పాపి:—అయ్యా! నే నొకమహాపాపిని. నాజీవితమంతయు దుష్కార్యములతో నిండియున్నది. ఒక్క సత్కార్యమునైనను నాజీవితమునఁ జేసియుండలేదు.

స్వర్గవ్యక్తి:—(గద్దింపుతో) పాపుల కీస్వర్గరాజ్యమున తావులేదు. పో, పొమ్ము.

పాపి:—మహాప్రభూ! మీకంఠధ్వనిమాత్రమే వినుచున్నానుగాని మీరలెవ్వరో నెఱుంగలేకున్నాను. మీముఖము నాకగపడుటలేదు. దయచేసి మీపేరు సెలవిచ్చెదరా?

స్వర్గవ్యక్తి:—నేను క్రీస్తుయొక్క శిష్యాగ్రేసరుఁడనైన పీటరును. **(Peter the Apostle)**

పాపి:—పీటరుమహాశయా! ఈపాపిని కరుణించుము. మానవుని హృదయదౌర్బల్యమును, దేవదేవుని కరుణామయచిత్తమును జ్ఞప్తికిదెచ్చుకొనుము. మీరు క్రీస్తుదేవుని ప్రథమశిష్యులుకారా? ఆయన బోధామృతమును మీరు స్వయముగాఁ గ్రోలితిరిగదా! వారిసేవ మీరు స్వయముగసల్పితిరి—వారి మనఃకమలముకంది వారు మానవుల అవిశ్వాసమునకు దుఃఖించుచు మిమ్ములను మేలుకొనియుండి దైవమును ప్రార్థించుచుండుమనగా ముమ్మారుకూడ మీరు ఆజ్ఞనుమీరి మైమరచి ప్రమత్తతతో నిద్రించినసంగతి జ్ఞాపకమున్నదా?—నేనును అట్టి దుర్బలుడనే. మరియొకసంగతి. ప్రాణావసానదశయందైనను మిమ్ములను కాచికొనియేయుందునని ప్రమాణముజేసి 'కయాఫస్' అధికారియెదుట కృతఘ్నుడనై నీప్రాణములమీది తీపిచే మీప్రభువగు క్రీస్తుదేవుని విడనాడినసంగతి మీకు జ్ఞాపకమున్నదా?—నేనును అట్టిదుర్బలుడనే!—మరియు తెల్లవారుజామున ముమ్మారు కోడికూతవిని మీరు మీకృతఘ్నతకు మనోదౌర్బల్యమునకు కన్నీరు కాలువలైపార మీరు దుఃఖించినసంగతి మీకు జ్ఞాపకమున్నదా?—నాస్థితియునట్లె—మీరు నన్ను లోనికిరానీయ కెట్లు అడ్డుపెట్టగలరు?

వెంటనే స్వర్గద్వారములోనివ్యక్తి నోరుమూసికొనెను. కొంతతడవాగి పాపి తిరిగి స్వర్గద్వారములతట్ట నారంభించెను. తనను లోనికి రానీయమని ప్రార్థింపఁజొచ్చెను. లోనుండి మరియొకవ్యక్తి.

ద్వితీయవ్యక్తి:—ఎవరువారు? భూలోకమున నీ వెట్లు జీవితమునుగడపితివి?

పాపి:—నేనొక మహాపాపిని. నాజీవితమున నొక్క సత్కార్యమైనను జేసియుండలేదు.

1064

ద్వి. వ్యక్తి:—పో! అపలకుపొమ్ము! పాపాత్ములకు మాతో సమానముగ స్వర్గముననిలువ తావులేదు.

పాపి:—మహాశయా! పుణ్యాత్మా! మీరలెవ్వరో నేనెరుంగలేకున్నాను. మీకంఠధ్వనిమాత్రము వినబడుచున్నది. కాని గుర్తింపలేకున్నాను. మీరు నాకగపడుటలేదు. దయచేసి మీనామాంకితమును నేనెరుగవచ్చునేని సెలవిచ్చెదరా?

ద్వి. వ్యక్తి:—నేను దావీదును. మహారాజును, ప్రవక్తను. **(King David)**.

పాపి అధైర్యమ్మునొందలేదు. స్వర్గద్వారములవీడలేదు.

పాపి:—దావీదుమహారాజా! నన్ను కరుణింపుము. మనుష్యునిదౌర్బల్యమును, సర్వేశ్వరుని నిర్హేతుక జాయమానకటాక్షమును స్మరణకు దెచ్చికొనుము.—దేవదేవుడు నిన్ను ప్రేమించి మహారాజుగ నొనర్చినాడు. నీకు సర్వము నొసంగినాడు. రాజ్యము, కీర్తి, ధనధాన్యములు, భార్యలు, సంతతి, సర్వమునొసంగి, లోటను నది నీవెరుంగనట్లొనర్చినాడు—కాని నీసౌధమునుండి సామాన్యమానవుడగు "ఉరయ్య"ని భార్యను నీవు పాపదృష్టిచే వీక్షించితివి. దుర్మోహము నీహృదయమున మొలకలెత్తెను. నీవు బలవంతుడవగు రాజువగుటచే అమాయకుడగు 'ఉరయ్య'నిఁ జంపించితివి. అతని సతీతిలకము నపహరించి మహాపాప మొడిగట్టుకొంటివి.—నేనును అట్లే పాపిని—తదుపరి నీవెట్లు పశ్చాత్తప్తుడవై దుఃఖించితివో నీకు జ్ఞాపకమున్నదా? కొంచెము స్మరణకుదెచ్చుకొనుము—"నాపాపకార్యములను గుర్తించితిని. నాపాపము ఎల్లప్పుడు నాయెదుట ప్రత్యక్షమై నాకన్నులకు గట్టినట్లున్నది." అనిగదా నీవు విలపించితివి.—నేనును పశ్చాత్తప్తహృదయుడనైతిని. నీవెట్లు స్వర్గద్వారములనాపై మూసివేయగలవు?

లోనివ్యక్తి సిగ్గుజెంది మౌనముధరించెను. పాపి మరికొంతతడవు వేచియుండి తిరిగి స్వర్గద్వారముల తట్ట నారంభించెను. స్వర్గరాజ్యమునుండి మూడవవ్యక్తి ఈక్రిందివిధమున పలుక నారంభించెను.

మూడవవ్యక్తి:—ఎవరువారు? స్వర్గద్వారములను తెరువుడనుచున్నారు. స్వర్గములో కాలిడుటకు భూలోకమున నీజీవిత మెట్లుగడపితివి?

పాపి:—నేనొక ఘోరపాపిని. దారుణకృత్యము లొనర్చితిని. నాజీవితమంతయు పాపభూయిష్ఠము.

మూ. వ్యక్తి:—పో! పొమ్మువలకు! పాపులకు దేవునిస్వర్గరాజ్యమున స్థానములేదు.

పాపి:—ఓ మహాశయా! మీస్వరముమాత్రము వినఁబడుచున్నది. మిమ్మును గుర్తింపలేకున్నాను. మీరు నాకగపడుటలేదు. దయచేసి మీరలెవ్వరో నేనెరుంగవచ్చునా?

మూ. వ్యక్తి:—నేను పరిశుద్ధుడగు యోహానును. **(John the Divine)** క్రీస్తుదేవుని శిష్యుడను.

పాపి:—(అంతట బహుసంతోషముతో) నేనిప్పుడు నిశ్చయముగా స్వర్గరాజ్యములోనికి ప్రవేశమును గందును. పీటరును, దావీదునుగూడ నన్ను లోనికి తప్పక రానిత్తురు. వారికి మనుష్యుని హృదయదౌర్బల్యమును, దేవదేవుని అపారకరుణారసమహిమయు రెండును అనుభవమే—నీవు మానవకోటిని ప్రేమించుటయు, ప్రేమతత్వమును పూర్తిగ నెరిగినవాడవునైయున్నావు. "దైవము ప్రేమస్వరూపుడనియు, ప్రేమింపలేనివాడు దేవునిఁ దెలియజాలడనియు" నీవేగదా లోకమునకు వెల్లడించినది? మరియు, నీవృద్ధాప్యమున 'సోదరులారా! ఒకరినొకరు సోదరభావముతో ప్రేమించికొనుడ'ని ముఖ్యముగ మనుష్యకోటికి బోధించితివిగదా?—అట్టి నీవు నన్నెట్లు ద్వేషింపగలవు?—అసంభవము. నన్నెట్లు స్వర్గద్వారములనుండి క్రిందికి త్రోయగలవు? నీవు నీప్రేమసిద్ధాంతమునైనను త్యజింపవలెను. లేదా నన్ను స్వర్గరాజ్యములోనికి తీసికొనవలెను.

అంతట స్వర్గద్వారములు తెరువబడెను. యోహాను పశ్చాత్తప్తుడగు పాపిని ప్రేమపూర్వకముగఁ గౌగిలించుకొని స్వర్గరాజ్యములోనికి మహానందముతోఁ గొంపోయెను.

—"టాల్‌స్టాయి"

1065